ఎమర్జన్సీలో ఇలాటివెన్నో....

# రాళ్ళు

అత్తలూరి నరసింహారావు



"బస్సొచ్చే ఏళయింది తొరగా కానియ్" అన్నారు దశరథరామయ్యగారు.

"ఇదిగో అయిపోయింది" అంటూ సంచి పట్టుకొచ్చింది మాణిక్యమ్మగారు.

"అడుగున వేరుసెనక్కాయలు పోసి పెడుతున్నాను. అయ్యి ఆడికి చాలా ఇష్టం." అంది మాణిక్యమ్మగారు.

"సరే" అన్నారు దశరథరామయ్యగారు.

"ఇదిగో దీంట్లో మాఁవిడికాయపచ్చడి పెట్టాను. జాగర్త. డబ్బా ఒరిగిపోతే నూనె కారిపోగలదు. మధ్యమధ్యలో చూసుకుంటా వుండండి" అంది మాణిక్యమ్మగారు.

"ఊఁ" అన్నారు దశరథరామయ్యగారు.

"ఇదిగో దీంట్లో గోంగూర పచ్చడి పెట్టాను. కొద్దిగా కారం ఎక్కువయినట్టుంది. కాస్త నెయ్యి ఎక్కువ వేసి కలుపుకుని తినమనండి వాడితో-మర్చిపోకుండా"

"ఊఁ."

"దీంట్లో నిమ్మకాయ పచ్చడి పెట్టాను. చూసుకుని తీసుకోమనండి. ఈ సంవత్సరం కాయలు మా గిరాకీగా వుంటం వల్ల తక్కువ పెట్టానని చెప్పండి."

"ఊఁ—ఊఁ."

"ఇదిగో ఈ పక్కన నేతి డబ్బా పెట్టాను. మూత బిగుతుగావుందో, లేదో అప్పుడప్పుడు చూస్తూ వుండండి. ఒలికిపోయిందంటే మొత్తం సంచంతా ఖరాబవుతుంది. అసలక్కడ నెయ్యి ఏసుకుంటున్నాడో లేదో నా తండ్రి. జాగ్రత్తగా తీసికెళ్ళండి."

"సరే సరే."

"అబ్బాయి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని చెప్పండి. వారం వారం ఉత్తరం ముక్క రాయమని చెప్పండి."

"సరేలేవే."

"డబ్బు బనీను లోపల జేబులోనే పెట్టుకున్నారుగా. జేబుకి పిన్నీసు పెట్టుకోండి. రైల్లో జాగ్రత్త. నిద్రపోకండి. అసలే రైళ్ళలో దొంగలు తిరుగుతూ వుంటారు. రైలు దిగిన తరవాత రిక్షాచేసుకునివెళ్ళండి"

బస్సు ఊళ్ళోకి వచ్చినట్టు ఇళ్ళ మీదకొచ్చే దుమ్ము చెబుతుంది. దశరథరామయ్యగారు సంచి తీసుకొని బయలుదేరారు.

"ఇదిగో సంచిపైన జతబట్టలు పెట్టాను మీవి. ఎళ్ళగానే ఒంటిమీదయి ఇడిసి చాకలాడికేసెయ్యండి. ఎక్కువ రోజులు అక్కడ వుండకండి. మళ్ళీ కోతలు వచ్చేస్తున్నాయి. రోజూ పాలు తియ్యటం నాకు కష్టం. ఆ గేదె అసలే తంతుంది. అబ్బాయితో అన్ని విషయాలు మాట్లాడి తొరగా వచ్చేసెయ్యండి. ఆడ్ని అడిగినట్టు చెప్పండి. బాగా సదువుకోమని చెప్పండి. ఈ ఏడు బాగా సదివి గట్టెక్కించమని చెప్పండి. ఇక్కడంతా బాగానే వున్నామని చెప్పండి. ఉండండి- ఈ పదీ ఆడి సేతిలో నేను ఇమ్మన్నానని సెప్పి పెట్టండి."

అంటూ బస్సు దగ్గర కెళ్ళే వరకు దశరథరామయ్యగారితో మాణిక్యమ్మగారు చెబుతూనే వుంది. దశరథరామయ్యగారు బస్సుఎక్కి కిటికీ వైపుకి సర్దుకుని కూర్చున్నారు. కిందనుంచి మాణిక్యమ్మగారు నుంచుని ఏదేదో చెబుతూనే వుంది.

చివరికి బస్సు కదిలింది. మాణిక్యమ్మగారు బస్సు లేపిన దుమ్ములో మాయమయ్యింది.

బస్సు విజయవాద స్టాండ్‌లో ఆగింది. దశరథ రామయ్యగారు రైలుస్టేషన్ చేరి. టిక్కెట్టు కొనుక్కుని ప్లాట్‌ఫారం కనుక్కుని అక్కడకెళ్ళి కూర్చున్నారు.

కాసేపటికి రైలు రానే వచ్చింది. ప్రయాణీకులు సందడి సందడిగా, తొడతొక్కిడిగా వున్నారు. ప్రయాణీకుల్ని. వాళ్ళ సామానుల్ని తోసుకుంటూ వెళ్ళారు దశరథరామయ్యగారు. పోర్టర్లనీ. వాళ్ళు మోసే పెట్టెల్ని రాసుకుంటూ వెళ్ళారు దశరథ రామయ్యగారు. అమ్ముకునే వాళ్ళనీ. వాళ్ళ బళ్ళనీ తప్పుకుంటూ వెళ్ళారు దశరథరామయ్యగారు.

ఎలాగయితేనేం మొత్తంమీద చిన్నసీటు సంపాయించి ఆరుగురి మధ్యలో ఇరుక్కుని, జాగ్రత్తగా సర్దుకుని కూర్చున్నారు దశరథరామయ్యగారు.

కాసేపటికి రైలు కూతవేసి ఒక్క కుదుపుతో కదిలింది.

ఒక్కసారి సంచివైపు చూసి. సంచీపైనున్న తన బట్టల్నితీసి. వాటి కింద వున్న మాఁవిడికాయ పచ్చడి నూనె కారిందో, లేదో చూశారు. నిమ్మకాయ

పచ్చడి మూత గట్టిగానే వుందో, లేదో చూశారు. గోంగూర పచ్చడి మూత బిగుతుగావుందో లేదో చూశారు. నెయ్యి డబ్బా ఒలికిందో లేదో చూశారు. అడుగున వేరుశనక్కాయలు నలిగాయో, లేదో చూశారు. చూసి, అన్నీ ఒక్కసారి సర్ది, టిక్కెట్టు ఒకసారి చూసుకుని, చొక్కా కింద బనినుకి పిన్నీసు వుందో, లేదో చూసుకుని, జేబులో డబ్బు ఒకసారి తడిమి చూసుకుని భద్రంగా, తృప్తిగా కూర్చున్నారు. పక్క పెద్దమనిషి దశరథరామయ్యగార్ని పలకరించారు.

"ఎందాకా అండీ" అని.

"విశాఖపట్నం దాకా."

"ఏం పనిమీద వెళ్తున్నారు."

"మా అబ్బాయిని చూడ్డానికి."

"మి అబ్బాయి ఏం చేస్తున్నాడక్కడ? ఉద్యోగమా?"

"లేదండీ. ఇంకా సదువుకొంటానే వుండాడు."

"ఏం చదువు తున్నాడండి."

"అదేనండి. ఎమ్మేనో ఎమ్మెస్సీనో అంటారే అది."

"ఆహా: ఏ సంవత్సరం చదువుతున్నాడండి?"

"క్రితం ఏడాది నాష్లేసేటప్పుడు జేరాడండి. ఇది రెండో ఏడు, దీన్తో ఆఖరండి."

"అహా. మీకెంత మందండి పిల్లలు?

"ఈ దొక్కడేనండి మాకు"

"ఏ మాత్రం పొలం వుందండి?"

"ఏదో నాలుగెకరాల మాగాణి వుందండి."

"క్రితం సంవత్సరం మార్కులు ఎలా వచ్చాయండి?"

"అయ్యేటి నాకు తెలవదండి, కానండి మావోడు బాగానే సదువుతాడండి. మా ఊళ్ళో ఇస్కూల్లో సదివేటప్పుడు అన్నిట్లోను. అందరికన్నా మంచి మార్కులొచ్చాయండి. ఆ తరవాత పెద్ద క్లాసుల్లో కూడా బాగా మార్కులొచ్చాయండి. మావోడికి చాలా బవుమతులు. సటిపికేట్లు వచ్చాయండి. ఆడు మెరికలాంటోడండి. ఒకసారి పుస్తకం పట్టుకుని సూసినాడంటే మర్చిపోడండి. అంతటి గాపకం అండి ఆడిది. ఆడి దగ్గరకి అందరు కుర్రోళ్ళూ వచ్చి అదేట్రా, ఇదేట్రా అని సెప్పించుకుని ఎళతారండి. పంతుళ్ళకూడా మావోడంటే మాంచి గురండి. ఊరోళందరూ సదివించూ, సదివించూ అని పట్టుబట్టినారండి. ఆడూ పై సదువులు సదువుతానన్నాడండి. కరుసులికి తట్టుకోలేకపోయినా అప్పో. సొప్పో సేసి సదివిస్తన్నాంవండి. ఈ ఏటితో సదువు అయి

# తెల్లవారాక

రాజకీయాలు
ప్రణాళికలు
మంత్రుల ప్రయాణాలు
ప్రకటనలు–ఖండనలు
ఏక్సిడెంట్లూ, ఆటలు, సినిమాలు
అదృష్టజాతకాలు
చురుకుగా చాలా తేలికగా
ప్రసారంచేసే
ప్రతికలనిండా
ఆ రాత్రి తుఫాను తర్వాత
బాగా నాని....
ఉబ్బిన,
అక్షరాల శవాలు!

—దేవరాజు మహారాజు

పోతందని సెబుతున్నాడండి మావోడు. ఇక మూడుముళ్ళు ఏయించేసి ఒకింటోణ్ని సేస్తావండి. ఆడికి నచ్చిన పనిలోకి ఆడు ఎల్లిపోతాడండి. ఆడు సుకంగావుంటే మేం సుకంగా వున్నట్టే గదండీ. అంతకన్నా ఏంగావాల సెప్పండి" అని దశరథరామయ్యగారు ముగించారు.

తర్వాత పెద్దమనిషి నిద్రలోకి వెళ్ళాడు. దశరథరామయ్యగారు కాసేపు మేలుకొని, నెమ్మది నెమ్మదిగా జోగడం మొదలెట్టారు.

రైలు వాల్తేరు స్టేషన్‌లో కొచ్చేసరికి తెల్లగా తెల్లవారింది.

దశరథరామయ్యగారు రిక్షా కట్టించుకుని కొడుకున్న రూము దగ్గర కొచ్చేసరికి బారెడు పొద్దెక్కింది. రూములో వాళ్ళు మెలకువ వస్తున్నా నిద్రలేవడం లేదు.

ఓరగా తెరిచి వున్న గుమ్మం దగ్గిర నిలబడి—

"ఒరే సచ్చం" అంటూ పిలిచారు దశరథరామయ్యగారు.

సత్యం తప్ప అక్కడ పడుకున్నవారంతా లేచారు.

"ఎవరూ" అన్నాడు వాళ్ళలో ఒకతను

"నేను - దశరథరామయ్యని" అంటూ లోపలికెళ్ళారు దశరథరామయ్యగారు.

అక్కడివాళ్ళంతా మొఖ మొఖాలు చూసుకొన్నారు. ఏం చెప్పాలో ఎవరికీ ఏం తోచటంలేదు.

"ఏం బాబూ మావోదేడి కనబడ్డేం" అన్నారు దశరథరామయ్యగారు. మళ్ళీ నిశ్శబ్దం.

"ఏం బాబూ ఏవన్నా పనిమీద ఎళ్ళాడా మావోడు" అన్నారు ప్రశ్నార్థకంగా దశరథరామయ్యగారు.

మళ్ళీ నిశ్శబ్దం.

"ఏం బాబూ నాకోసం వేమన్నా రైలు దగ్గరకెళ్ళేడేంవిటి మావోడు" అన్నారు దశరథరామయ్యగారు.

మళ్ళీ నిశ్శబ్దం.

"ఏం బాబూ మాట్టాడరేంవిటి మీరంతా" అని ప్రశ్నించారు దశరథరామయ్యగారు.

"మన సత్యాన్ని పోలీసులు పట్టుకెళ్ళారండి" అన్నాడు వాళ్ళలో ఒకడు వున్న సత్యాన్ని బయటపెడుతూ - బాధతో.

"పోలీసులు పట్టుకెళ్ళారా? ఎందుకు బాబూ" అన్నారు ఆదుర్దాగా దశరథరామయ్యగారు.

"ఎమర్జన్సీ గదండీ. అందుకు." అన్నాడు రెండోవాడు ధైర్యంచేసి.

"ఎమర్జన్సీ అంటే ఏంవిటి బా...."

అంతలో

అక్కడ ఒక జత బట్టలు తుళ్ళిపడ్డాయి. మామిడికాయ పచ్చడిలోని నూనె నేల మీదికి ఒలికిపోయి ఎర్రగా కనిపిస్తోంది. గోంగూర పచ్చడి డబ్బామూత ఊడిపోయి అల్లంత దూరాన పడింది. నిమ్మకాయ ముక్కలు నిమ్మకు నీరెత్తినట్టు నిశ్శబ్దంగా పడివున్నాయి. వేరుశనక్కాయలు బస్తాలోంచి కుమ్మరించినట్టుగా చెల్లాచెదురైపోయాయి. నెయ్యి నీళ్ళ మడుగులావుంది. సంచి గాలిపోయిన బెలూన్‌లా ముడుచుకుని ఒకచోట పడివుంది.

ప్రాణులకి మాటలున్నాయి.

కాని,

మాటలకి ప్రాణాలు లేవు. ★



సంక్రాంతి ముగ్గు

చిత్రం : ఎస్. బజరంగ్, హైదరాబాద్